క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ

చొప్పదండి: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల రెండో వారంలో నిజామాబాద్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ 17 విభాగంలో పాల్గొనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టుకు విద్యార్థులు కె. సౌమ్య, పి. కాశీవిశ్వనాథ్ ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కొమురోజు కృష్ణ తెలిపారు. సెప్టెంబర్ 21న జగిత్యాల జిల్లాలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎంతో, పీడీతో పాటు తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీగాద సంతోశ్ విద్యార్థులను అభినందించారు.

చేతిరాతపై పరీక్ష



డిక్షనరీ అందిస్తున్న ట్రస్టు సభ్యులు

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేతిరాతపై బుధవారం పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన పదిమంది విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్, ఇన్‌చార్జి హెచ్ఎం శైలజ డిక్షనరీలు అందించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు, కంప్యూటర్లను విద్యకు సంబంధించి వినియోగించాలన్నారు. రాస్తూ ఉంటే అందమైన రాత వస్తుందని, భవిష్యత్‌లో చేతిరాత చాలా ఉపయోగపడుతుందన్నారు. ట్రస్ట్ సభ్యులు రాత పరీక్ష నిర్వహించి బహుమతులు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసయ్య, రవీందర్, రాజేష్, కుమార్, హిమబిందు, భానుప్రకాష్, జ్యోతి, సుల్తానా, సరస్వతి, సంజీవయ్య, చంద్రమోహన్ పాల్గొన్నారు.

బస్సు రూట్ పరిశీలన



మాట్లాడుతున్న డీఎం విజయమాధురి

శంకరపట్నం: గద్దపాక బస్సు రూట్‌ను కరీంనగర్ డిపో మేనేజర్ విజయమాధురి పరిశీలించారు. రోడ్డు బాగాలేదని నెల రోజులుగా కాచాపూర్, రాజాపూర్ గ్రామాలకు ఆర్డీనరీ బస్సు సర్వీసును నిలిపివేశారు. దీంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాచాపూర్ గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి ఆర్ఎంకు, డీఎంకు సీపీఐ నాయకుడు యుగేందర్ ఫిర్యాదు చేశారు. ఆర్ఎం ఆదేశాల మేరకు కాచాపూర్, రాజాపూర్ రోడ్డును పరిశీలించిన డీఎం, కేశవపట్నం బస్టాండ్‌లో గద్దపాక బస్సు డ్రైవర్, కండక్టర్‌తో మాట్లాడారు.

సన్మానం



శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నీరజ, టీచర్ ఆదిలక్ష్మి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. బుధవారం గెజిటెడ్ హెచ్ఎం రాష్ట్ర అధ్యక్షుడు రాజబాను ఉపాధ్యాయులను సన్మానించారు.

కోరిన సమాచారం నెలరోజుల్లో ఇవ్వాలి

హుజూరాబాద్: సమాచార హక్కు చట్టం ప్రకారం పౌరులు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లో అందించాలని తహసీల్దార్ కనకయ్య స్పష్టం చేశారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి ఇరవై ఏళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ గూడూరు స్వామిరెడ్డి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. పౌరులు అడిగిన సమాచారాన్ని ఇవ్వడంలో విఫలమైతే, సంబంధిత అధికారులు రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్‌కు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌రెడ్డి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇకనైనా స్పందిస్తారా..?



జమ్మికుంట: పట్టణంలోని రైతుబజార్, పాత మార్కెట్ రోడ్డు మురుగుకాలువ సమీపంలో నడిరోడ్డుపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. రాత్రివేళ వాహనదారులు, పాదచారులు అందులో పడే ప్రమాదముంది. రోడ్డుపై గుంత ఉందని తెలిసేందుకు ఓ వ్యక్తి ఇలా జిరాక్స్‌సెంటర్ బోర్డును సూచికగా పెట్టారు. మున్సిపల్ అధికారులు వెంటనే గుంతను పూడ్చివేయాలని కాలనీవాసులు, వాహనదారులు కోరుతున్నారు.

అప్పు పుట్టక అవస్థలు

- లంబాడిపల్లిలో రెండేళ్లుగా నిలిచిన బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలు
- సంఘాల డబ్బులు సొంతానికి వినియోగించుకున్న సీఏ



చిగురుమామిడి మండలంలోని లంబాడిపల్లి గ్రామంలో 25 స్వశక్తి సంఘాలున్నాయి. వీటిలో దాదాపు 250 మంది మహిళా సభ్యులు ఉన్నారు. వీరు తీసుకున్న రుణాలు నెలనెలా గ్రామ సీఏకు చెల్లించారు. వాటిని సంబంధిత బ్యాంకులో జమచేయకుండా సొంతానికి వాడుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది. దీంతో రెండేళ్లుగా గ్రామంలో ఐకేపీ సెర్ప్ కార్యాకలాపాలు నిలిచిపోయాయి. పాత రుణాలు పూర్తిస్థాయిలో రికవరీ కాకపోగా కొత్త రుణాలు ఇవ్వడంలేదు.

డబ్బుల దుర్వినియోగం వెలుగులోకి తీసుకొచ్చిన 'సాక్షి'

గ్రామంలో స్వశక్తి సంఘాల డబ్బుల దుర్వినియోగంపై 2023 జూలై 26న 'మహిళా సంఘాల డబ్బులు ఎవరు తిన్నారు' అనే శీర్షికన సాక్షిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన అప్పటి ఏపీఎం డబ్బుల దుర్వినియోగం వాస్తవమేనని ధ్రువీకరించారు. ఆగస్టు 1న అప్పటి డీఆర్‌డీఏ ఏపీడీ బొజ్జ వెంకటేశ్వర్లు స్వశక్తి సంఘాల మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి విచారణ జరిపారు. విచారణలో సుమారు రూ. 38 లక్షలు సీఏ సొంతానికి వాడుకున్నట్టు తేలింది. అందులో రూ.పది లక్షలు రికవరీ కాగా మిగిలిన నగదుకు తానే బాధ్యురాలు అంటూ నోట్ రాయించుకున్నారు. తీసుకున్న డబ్బులు బ్యాంకులో జమచేయడంలేదని చిగురుమామిడి యూనియన్ బ్యాంకు అధికారులు 16 స్వశక్తి సంఘాలకు అప్పుడు నోటీసులు జారీ చేశారు.

రికవరీ కాని డబ్బులు

రెండేళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో డబ్బులు రికవరీ కాకపోవడంతో 25 స్వశక్తి సంఘాల సభ్యులకు బ్యాంకు, శ్రీనిధి నుంచి రుణాలు అందడంలేదు. దీంతో సామాన్య, మధ్యతరగతి మహిళలు బయట అప్పులు పుట్టక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. నెలనెలా నిర్వహించే బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, చెల్లింపులపై సమావేశాలు నిలిచిపోయాయి. ప్రతినెలా బ్యాంకులో జమచేయాల్సిన పొదుపు నిలిచిపోయింది. బ్యాంకు అధికారులు పొదుపు చేయని సంఘాలను పట్టించుకోరు. ఆ సంఘాలను బ్లాక్ లిస్టులో పెట్టినట్టేనని ఆరోపిస్తున్నారు. పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించేదెన్నడు, తిరిగి రుణాలు అందేదెన్నడు అంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య రెండు సంఘాలకు క్లీన్ చిట్ రావడంతో రుణాలు ఇప్పించినట్లు సీసీ తెలిపారు. దాదాపు రూ.ఏడు లక్షలు రికవరీ కావాల్సి ఉందని, ఇటీవల బదిలీపై వచ్చానని, సత్వరం రికవరీ చేసి మహిళలకు రుణాలు ఇప్పిస్తానని చిగురుమామిడి టీసెర్ప్ ఏపీఎం రజిత తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలి



హుజూరాబాద్: పట్టణంలోని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారికి బుధవారం బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం సమర్పించారు. జమ్మికుంట, హుజూరాబాద్ పట్టణాల్లోని బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన ఫీజు బకాయిలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని, వెంటనే ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేయాలని కోరారు.

సమస్య



మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామ శివారులో ఈదులగట్టెపల్లికి వెళ్లేదారి పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. తక్కువ ఎత్తులో ఉండటంతో మూగజీవాలతో పాటు ఆదమరిచి ప్రజలు అటుగా వెళ్తే ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
- సత్యనారాయణ, ఏఈ సెల్: 8712483327

వాట్సాప్ చేయండి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఘనంగా కుంకుమపూజ



హుజూరాబాద్‌రూరల్: బోనాలతో వెళ్తున్న మహిళలు

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాన వార్షికోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వేదపండితులు భాస్కర్, మణికంఠ, పృథ్వీరాజు మంత్రోచ్చరణల మధ్య చండీయాగం, కుంకుమపూజ కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం మహిళల కోలాటం మధ్య ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని వీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం సిర్సపల్లి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది. గ్రామంలోని భక్తులు బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయం నిర్మించాలని వినతి

చొప్పదండి: పట్టణంలోని టీటీడీ కళ్యాణ మంటపం ఆవరణలో తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా నిధులు మంజూరు చేయించి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాలని కోరుతూ పట్టణానికి చెందిన జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా శివారెడ్డి బుధవారం టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ నేమూరి శంకర్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. కళ్యాణ మంటపం కాంట్రాక్టర్‌ను మార్చి స్థానికులకు సమకూర్చాలని కోరారు. స్థానికుల కోరిక మేరకు ఆలయ నిర్మాణం జరపాలని విన్నవించారు.

ఆశా కార్యకర్తలపై పనిభారం మోపొద్దు



మాట్లాడుతున్న ఎడ్ల రమేశ్

చిగురుమామిడి: తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలపై ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది వేధింపులు ఆపాలని సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ కోరారు. బుధవారం చిగురుమామిడి మండలస్థాయి ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆశా కార్యకర్తలపై పనిభారం మోపుతున్నారని, ఏఎన్ఎం, ఇతర సూపర్‌వైజర్లు చేయాల్సిన పనులతోపాటు ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఓపీలు రాయించడం సరిదికాదన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు చేయాల్సిన కనీస బాధ్యతను గుర్తించకపోవడం విడ్డూరమన్నారు. ఏఎన్‌సీ టార్గెట్ కోసం ఫేక్ రిపోర్టు రాయాలని పురమాయించడం ఏంటని, చిగురుమామిడితో పాటు ఇతర మండలాల్లో ఆశా కార్యకర్తలను వేధిస్తున్న వారిపై కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌వోకు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో ఆశా కార్యకర్తల యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి మారెల్ల శ్రీలత, మండలశాఖ అధ్యక్షురాలు నాగెల్లి పద్మ, ప్రధానకార్యదర్శి బోయిని ప్రియాంక, కలఎన, సునీతా, లక్ష్మి, అంజలి, స్రవంతి, శ్వేత, సుగుణ పలువురు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



ఫార్మసీ గదిని పరిశీలిస్తున్న వెంకటరమణ

శంకరపట్నం: కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణ తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్, మందులు, ల్యాబ్, లేబర్ రూం పరిశీలించారు. బీపీ, షుగర్ వ్యాధితో బాధపడుతున్నవారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు అందించాలన్నారు. ఆరోగ్యకేంద్రంలో సాధారణ కాన్పులను పెంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో చందు, వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

మానకొండూర్ పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం



బాలింతతో డాక్టర్లు, వైద్య సిబ్బంది

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన మహిళ మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మగబిడ్డకు జన్మనిచ్చిందని పీహెచ్‌సీ వైద్యాధికారి సల్మాన్ తెలిపారు. ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకూ ఆరోగ్య కేంద్రంలో 21 సుఖ ప్రసవాలు జరిగాయని, సిబ్బంది సమష్టి కృషితో ప్రసవాల సంఖ్య పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజునాయక్, సూపర్‌వైజర్ స్నేహలత, జుబేర్, సరోజ, స్టాఫ్‌నర్స్ సహనాజ్ బేగం, రాజమణి, ఏఎన్ఎం శ్యామల, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

శంకరపట్నంలో కోర్టు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

శంకరపట్నం: మండలంలో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేయాలని జిల్లా, హుజూరాబాద్ న్యాయమూర్తులకు లాయర్లు బుధవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండనికి చెందిన న్యాయవాదులు హరికృష్ణ, దేవయ్య, సురేశ్, నస్మిన్ షబనా, అనిల్‌కుమార్ ఉన్నారు.

కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న గోపినాథ్, తదితరులు

సైదాపూర్: మండల కేంద్రంలో కోర్టు ఏర్పాటుకు హుజూరాబాద్ కోర్టు సూపరింటెండెంట్ గోపినాథ్ బుధవారం భవనం, పరిసరాలను పరిశీలించారు. కేసుల సత్వర పరిష్కారానికి రెండు లేదా మూడు మండలాలకు ఒక సీనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టును మంజూరు చేస్తుండగా మండలానికి చెందిన న్యాయవాదులు సైదాపూర్‌లో కోర్టు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ మేరకు గోపీనాథ్ వెన్కెపల్లిలోని ఎస్టీ హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, న్యాయవాదులు వడిజె భీంరావు, వెంకటేశ్వర్‌రావు, గోపి, హరిహరన్, కుమారస్వామిలుఉన్నారు.

కమ్యూనిటీ పోలిసింగ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇల్లందకుంట: కరీంనగర్ సీపీ ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్‌పై ఎస్సై క్రాంతికుమార్ బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు, నేరాల నియంత్రణలో వాటి ప్రాముఖ్యత, ఆన్‌లైన్ మోసాలు, వివిధ చట్టాలపై అవగాహన, గంజాయి యువతపై ఏ విధంగా ప్రభావం చూపుతాయో వివరించారు. అనంతరం 'షేక్‌హ్యాండ్స్ విత్ తెలంగాణ పోలీస్- నారీ శక్తి' కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులు బ్లూ కోల్ట్స్ విధులు నిర్వహిస్తున్నారు. వాహన తనిఖీ, డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు చేస్తున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

గన్నేరువరం: వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లెల జగనోమహన్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సాంబయ్యపల్లెలో మాట్లాడారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కురిసిన అధిక వర్షాలతో వరి, పత్తి, మొక్కజొన్న కూరగాయల పంటలు చాలావరకు దెబ్బతిన్నాయని, రైతుల కష్టం నేలపాలైందన్నారు. వరిపంట నేలకొరిగి నీటిలో మునిగిందని, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.పదివేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ భూమయ్య, నాయకులు జీల కుమార్, తిరుపతి, ఎల్లయ్య, గడ్డం కరుణాకర్‌రెడ్డి, మల్లారెడ్డి రైతులు పాల్గొన్నారు.

కార్గో సేవలు వినియోగించుకోవాలి

శంకరపట్నం: కేశవపట్నం బస్టాండ్‌లో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రాజు కోరారు. బుధవారం కార్గో కేంద్రాన్ని తనిఖీ చేశారు. సురక్షిత, వేగవంతమైన సేవలు అందుబాటులో ఉన్నాయని, రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక కు తక్కువ ధరకే సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్వేష్, చంద్రమౌళి, ఏజెంట్ సురేశ్ ఉన్నారు.

వరిపంట పరిశీలన



వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో వరిపంటను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయాధికారులు, రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. వరిలో కంకినల్లి పురుగు ఉధృతి ఉందని, సన్నరకం వరిలో ఎక్కువగా ఉందని గుర్తించారు. వరిగింజలు గోదుమ లేదా నలుపు రంగులోకి మారడంతో నష్టపోవాల్సివస్తుందని, పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యకమంలో ఏఈవో వంశీకృష్ణారెడ్డి, పెంచాల రాజయ్య, ఆకుల సంజీవరావు, బాపురావు, మంద అంజయ్య, గొల్లన సదయ్య పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో సేవా దృక్పథం



మాట్లాడుతున్న గంగాధర్

జమ్మికుంట: ఎన్ఎస్ఎస్ శిబిరాలతో వలంటీర్లలో సేవా దృక్పథం పెరుగుతుందని డీఐఈవో, ఎన్ఎస్ఎస్ చైర్మన్ గంగాధర్ అన్నారు. మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ క్యాంపు ముగింపు సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సమాజం, పరిసరాల స్థితిగతులు, ప్రజలకు అవగాహన కల్పించాల్సి విషయాలపై పట్టు సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, ఏఈవో హేమలత, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ విశ్వనాథ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన యువకుడు రామగిరి రాకేశ్ (24) చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీఐ బి. సంజీవ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామగిరి రాకేశ్, తాళ్లపల్లి నరేశ్ ఈ నెల 6న లింగాపూర్ గ్రామం నుంచి బైక్‌పై వస్తుండగా జగ్గయ్యపల్లి వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో రాకేశ్ తీవ్రంగా గాయపడగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడని, రాకేశ్ తండ్రి కొమురయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

శుద్ధజలంలో తోకపురుగులు

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామంలోని ఓ శుద్ధజల ప్లాంట్ నుంచి వచ్చే నీటిలో బుధవారం తోకపురుగులు కనిపించడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాంట్ నిర్వాహకుడిని నిలదీస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడని, గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటర్ ప్లాంట్లపై అధికారుల పర్యవేక్షణ కరువైందని వాపోతున్నారు. ఇనన్నైనా అధికారుల నిఘా పెట్టాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

- **13న అప్రెంటిషిప్ మేళా**

విద్యానగర్(కరీంనగర్): ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళాలో భాగంగా ఈనెల 13న కరీంనగర్ ఉజ్వల పార్క్ పక్కనున్న ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ తెలిపారు. ఎలక్ట్రిషన్, పిట్టర్, మెకానిక్ డీజిల్, సీఓపీఏ ట్రేడ్లలో ఐటీఐ పాసైన అభ్యర్థులు అర్హత పత్రాలు, బయోడేటా, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.

- **కఠిన చర్యలు తీసుకోవాలి**

సప్తగిరికాలనీ(కరీంనగర్): హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పాలస్తీనా ఐక్యత కార్యక్రమంపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లో మాట్లాడుతూ.. ఈ దాడికి నాయకత్వం వహించిన ఏబీవీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలన్నారు.

- **నియామకం**

కరీంనగర్: బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి విశ్వబ్రాహ్మణ సామాజికవర్గం నుంచి సదానందచారిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు ప్రకటన విడుదల చేశారు. సదానందచారి బీసీ కులాల సంక్షేమానికి పాటుపడతానన్నారు.

గంజాయి కేసులో నిందితులకు జైలు

కరీంనగర్ క్రైం: గంజాయితో పట్టుబడిన ఇద్దరు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10,000 చొప్పున జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి డి.వెంకటేశ్ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. అలుగునూర్‌కు చెందిన గడ్డం అజయ్(20), నాగారపు రాము(20) మిత్రులు. ఇద్దరు దురలవాట్లకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. సికింద్రాబాద్‌లో ఒక వ్యక్తి వద్ద 3 కిలోల వరకు గంజాయిని 2022 సెప్టెంబర్ 23న అలుగునూర్‌కు బస్సులో తీసుకొని వచ్చారు. అదే రోజున మధ్యాహ్నం అలుగునూర్ చౌరస్తా వద్ద అప్పటి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ ఎస్సై ప్రమోద్‌రెడ్డి సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పోలీసులను చూసి పారిపోవాలని ప్రయత్నించగా.. వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. 3కిలోల గంజాయితో పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శరత్ వాదనలు వినిపించారు. న్యాయమూర్తి డి.వెంకటేశ్ బుధవారం నిందితులు ఇరువురికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10వేల చొప్పున జరిమానా విధించారు.